సంపుటి :02 సంచిక :205 పేజీలు :06 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

గురువారం 09, సెప్టెంబర్ 2025

### బీసీ కోటా పేరుతో
# కాంగ్రెస్ డ్రామా

- ఆరు గ్యారెంటీల తరహాలోనే మోసం
- ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కోటా కోసం ఢిల్లీలో కొట్లాడాలి
- కలిసి వచ్చేందుకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉంది..
- మాజీ మంత్రి హరీశ్‌రావు

02





# సర్కార్ భూమి స్వాహా!

భూపాలపల్లి జిల్లా కేంద్రానికి సమీపంలోని మండలంలో భూబాగోతం

భూపాలపల్లి జిల్లా కేంద్రానికి సమీపంలోని ఓ మండలంలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని అక్రమార్కులు కాజేశారు. స్థానికంగా ఎకరం రూ. 20 లక్షల వరకు పలికే 11.20 ఎకరాల భూమిని నలుగురు వ్యక్తులు, ఒక రెవెన్యూ అధికారికి భారీగా డబ్బు ముట్టజెప్పి తమ పేర్ల మీదికి రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిసింది. ఈ అక్రమం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో, రిజిస్ట్రేషన్ చేసిన అధికారి ఇప్పుడు చర్యలకు భయపడుతున్నట్లు సమాచారం. ఒకసారి రిజిస్ట్రేషన్ జరిగాక, దాన్ని రద్దు చేసే అధికారం సాధారణంగా వారికి ఉండదు. అయితే ప్రస్తుతం ఈ రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ కోసం ఉన్నతాధికారుల స్థాయిలో చర్చ జరుగుతున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారం అక్రమ రిజిస్ట్రేషన్లు రెవెన్యూ శాఖకు ఎలాంటి ఇబ్బందులు సృష్టిస్తాయో చెప్పడానికి ఒక ఉదాహరణగా చెప్పవచ్చు.

– అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

- 11.20 ఎకరాల ప్రభుత్వ భూమిని నలుగురి పేరిట రిజిస్ట్రేషన్?
- అందుకు భారీ మొత్తంలో సొమ్ము గుంజిన రెవెన్యూ అధికారి
- ఉన్నతాధికారులకు ఫిర్యాదుల వెల్లువ
- రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేస్తారా.. లేదా అన్న అంశంపై సందిగ్ధం
- క్యాన్సిల్ చేయాల్సి వస్తే ముందుగా సదరు అధికారిపైనే చర్యలకు ఛాన్స్

02



# లోకల్‌పై స్టే

స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు బ్రేక్

- కౌంటర్ దాఖలుకు సర్కారుకు 4 వారాల గడువు
- ప్రభుత్వ కౌంటర్ తర్వాత పిటిషనర్లకు రెండు వారాలు గడువు
- బీసీ రిజర్వేషన్లపై తదుపరి విచారణ ఆరువారాలకు వాయిదా
- హైకోర్టు స్టేతో ఆరు వారాలపాటు నిలిచిపోనున్న ఎలక్షన్స్

04



# పనులు త్వరగా పూర్తి చేయాలి

- ఏటీసీ కేంద్రాల అభివృద్ధిపై హనుమకొండ జిల్లా కలెక్టర్
- ములుగు రోడ్డులోని ఏటీసీ కేంద్రాల్లో అభివృద్ధి పనుల పరిశీలన

04

ఆర్టీఐ దరఖాస్తుల పరిష్కారంలో

# జనగామకు అవార్డు

రాష్ట్ర గవర్నర్ నుంచి అవార్డు అందుకున్న కలెక్టర్



02

# 76,463 ఎకరాల్లో పత్తి సాగు

- **కొనుగోలుకు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు**
- **జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి**

అక్షరదర్బార్, హనుమకొండ: పత్తి కొనుగోలు కేంద్రాల ద్వారా జిల్లాలో పత్తి కొనుగోలుకు చర్యలు చేపడుతున్నట్లు హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ వెంకట్ రెడ్డి చెప్పారు. హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ కార్యాలయంలో పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో గురువారం ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 76,463 ఎకరాల విస్తీర్ణంలో పత్తిని రైతులు సాగు చేశారని, సుమారు 9,17,556 క్వింటాళ్ల పత్తి రానుందని పేర్కొన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ పంట ఉత్పత్తిని విక్రయించాలంటే తప్పనిసరిగా కపాస్ కిసాన్ యాప్ లో నమోదు చేసుకోవాలని సూచించారు. పత్తిని విక్రయించేందుకు రైతులు తప్పనిసరిగా స్లాట్ బుక్ చేసుకుని కొనుగోలు కేంద్రాలకు రావాలన్నారు. పత్తిని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రానికి తీసుకు వచ్చేటప్పుడు చెత్తా చెదారం లేకుండా నాణ్యమైన పత్తిని తీసుకురావాలన్నారు. నాణ్యమైన పత్తి ఎనిమిది నుండి 12 శాతం లోపు తీసుకొని వచ్చినట్లయితే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను రైతులు పొందవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో మూడు జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లు జరుగుతాయన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, పారదర్శకంగా పత్తి కొనుగోలు ప్రక్రియలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ తెలిపారు . ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, తూనికలు కొలతలు, రవాణా, అగ్నిమాపక, సీసీఐ, ఏఎంసీ అధికారులు పాల్గొన్నారు.


www.aksharadarbar.com అక్షర దర్బార్ Voice of the people



- **భూపాలపల్లి జిల్లా కేంద్రానికి సమీపంలోని మండలంలో భూబాగోతం**
- **11.20 ఎకరాల ప్రభుత్వ భూమిని నలుగురి పేరిట రిజిస్ట్రేషన్ ?**
- **అందుకు భారీ మొత్తంలో సొమ్ము గుంజిన రెవెన్యూ అధికారి**
- **ఉన్నతాధికారులకు ఫిర్యాదుల వెల్లువ**
- **రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేస్తారా.. లేదా అన్న అంశంపై సందిగ్ధం**
- **క్యాన్సిల్ చేయాల్సి వస్తే ముందుగా సదరు అధికారిపైనే చర్యలకు ఛాన్స్**

# సర్కార్ భూమి స్వాహా !

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి:**

అది భూపాలపల్లి జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉండే ఒక మండలం. ఆ మండలంలో భూముల ధరలు వెరీ కాస్ట్లీ. ఇక్కడ ఓ గ్రామంలో ఎకరా సుమారు రూ.20 లక్షలకు పైగా పలుకుతుంది. అక్కడే పదుల ఎకరాల్లో ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిపై కొందరు అక్రమార్కుల కన్నుపడింది. దీనిని ఎలాగైనా కాజేయాలనే ఆశ కలిగింది. అనుకున్నదే తడవుగా ఓ రెవెన్యూ అధికారిని సంప్రదించారు. ఆ రెవెన్యూ అధికారికి పెద్ద మొత్తంలో డబ్బు ముట్టజెప్పి కొద్ది నెలల క్రితం 11.20 ఎకరాల భూమిని నలుగురు పేర్లపై బదలాయించుకున్నారు. ప్రభుత్వ భూమి పలువురిపై రిజిస్ట్రేషన్ అయిందని ఈనోటా ఆ నోటా పడి, ఉన్నతాధికారులకు ఫిర్యాదులందడంతో సదరు రెవెన్యూ అధికారి గతుక్కుమన్నాడు. ఒక్కసారి ఒకరి పేరుపై భూమి బదలాయించిన తర్వాత క్యాన్సిల్ ఆప్షన్ రెవెన్యూ అధికారులకు ఉండదు. దీంతో తేలు కుట్టిన దొంగలా సదరు రెవెన్యూ అధికారి ఎప్పుడేం జరుగుతుందోనని భయపడుతున్నాడు.

**- నాలుగు సర్వే నంబర్లలో..**

రెవెన్యూ అధికారి మొత్తం నాలుగు సర్వే నంబర్లలోని 11.20 ఎకరాల ప్రభుత్వ భూమిని నలుగురి పేరిట ధారాదత్తం చేశాడు. ఒక సర్వే నంబర్‌లో 3.20 ఎకరాలు, రెండో సర్వే నంబర్‌లో 0.20 ఎకరాలు, మూడో సర్వేనంబర్‌లో 4.00 ఎకరాలు, నాలుగో సర్వే నంబర్‌లో 3.20 ఎకరాల భూమి అన్యాక్రాంతమైంది. ఆ ప్రాంతంలో ఎకరా భూమి సుమారు రూ.20 లక్షల చొప్పున పలుకుతున్నది. అంటే.. అన్యాక్రాంతమైన భూమి విలువ సుమారు రూ.2 కోట్లకు పైగా ఉంటుందని సమాచారం. ఆ భూమిని నలుగురి పేరిట రిజిస్ట్రేషన్ చేసి కట్టబెట్టేందుకు రెవెన్యూ అధికారి భారీగా సొమ్ము వసూలు చేసినట్లు తెలిసింది.

**- చర్యలు తీసుకుంటారా? రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేస్తారా?**

ఒక్కసారి ఒక రెవెన్యూ అధికారి ఒకరి పేరుపై భూమి రిజిస్ట్రేషన్ చేశాక, ఇక ఆ అధికారికి ఆ రిజిస్ట్రేషన్ ను క్యాన్సిల్ చేసే అవకాశం ఉండదని తెలిసింది. సాంకేతికంగా అది సాధ్యం కాదు. కానీ, రెవెన్యూ డివిజినల్ అధికారి (ఆర్డీవో) కి మాత్రం సదరు అక్రమ భూరిజిస్ట్రేషన్ కు సంబంధించిన పాస్ పుస్తకాలను క్యాన్సిల్ చేసే అధికారం ఉంటుందని సమాచారం. ప్రస్తుతం ఆ 11.20 ఎకరాల అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి వచ్చిందని తెలిసింది. ఒకవేళ ఆ రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ కావాలంటే వారు, ముందుగా రిజిస్ట్రేషన్ చేసిన అధికారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే ఆ రిజిస్ట్రేషన్ చేసింది సదరు అధికారే కాబట్టి. ఒక అక్రమ భూరిజిస్ట్రేషన్ రెవెన్యూశాఖకు ఎలా తలనొప్పిగా మారుతుందో చెప్పడానికి ఇదో ఉదాహరణ.

# రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామా ..

**మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి.**



అక్షర దర్బార్, పరకాల: స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించే దమ్ములేకనే 42 శాతం రిజర్వేషన్లు అంటూ బడుగు బలహీన వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసంచేస్తున్నదని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మాయ మాటలు చెప్పి గతంలో బిసిలను మోసం చేసి గద్దెనెక్కింది ఈ కాంగ్రెస్. ఇప్పుడు కూడా అదే మోసంతో స్థానిక సంస్థ ఎన్నికల్లో లభిపొందాలని చేసిన కుట్రలు పటాపంచలయ్యాయి. ఈ నోటిఫికేషన్ వల్ల ఇప్పటికే గ్రామాలలో ఆశావాహులు ఖర్చులపాలయ్యారని వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. 420 హామీల తరహాలోనే 42శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామాలు ఆడుతుందని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్ల కోసం సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో కొట్లాడాలి, అఖిల పక్షాలను భాగస్వామ్యం చేయాలి. ఢిల్లీ వేదికగా జరగాల్సిన పోరాటాన్ని సీఎం రేవంత్ రెడ్డి గల్లీలో చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను అన్ని వర్గాల ప్రజలు గమనిస్తున్నారని, వారి చేతుల్లో ఈ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని అన్నారు.



# హాస్టల్ విద్యార్థులకు క్రీడా సామాగ్రి అందజేత

అక్షర దర్బార్, కాటారం: మహదేవపూర్ మండలకేంద్రంలోని బీసీ హాస్టల్ విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు పోలీసులు ముందుకొచ్చారు. మహదేవపూర్ సీఐ ఎన్. వెంకటేశ్వర్లు, ఎస్సై పవన్‌కుమార్‌తో కలిసి హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులకు క్యారం, చెస్ బోర్డులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జీవితంలో ఉన్నతమైన ఆశయాలు పెట్టుకొని వాటిని సాధించడానికి క్రమశిక్షణతో చదవాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్ సాంబయ్య పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదాలు



అక్షర దర్బార్ శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన మాందాడి సమ్మక్క–రాజు దంపతుల కుమారుడు చంద్రప్రకాష్–సౌమ్య వివాహ వేడుకలకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషిధర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందుపట్ల సత్యపాల్ రెడ్డి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తాడికొండ రవి కిరణ్, మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ, సోషల్ మీడియా కన్వీనర్ ఎర్ర రాకేష్ రెడ్డి, బూత్ అధ్యక్షుడు ఎర్ర తిరుపతిరెడ్డి, కొంగరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీఐ పరిష్కారంలో జనగామకు అవార్డు

**గవర్నర్ చేతుల మీదుగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కు పురస్కారం**




అక్షరదర్బార్, జనగామ : ఆర్టీఐ దరఖాస్తుల పరిష్కారంలో రాష్ట్రంలో అత్యుత్తమ ప్రదర్శన చూపిన జిల్లాగా జనగామకు గౌరవం దక్కింది. హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన ఆర్టీఐ వారోత్సవాల్లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ బెస్ట్ పెర్ఫార్మింగ్ డిస్ట్రిక్ట్ అవార్డు అందుకున్నారు. దరఖాస్తులను గడువులోపే పరిష్కరించడం, పెండింగ్ లేకుండా పారదర్శకంగా వ్యవహరించడమే ఈ గుర్తింపునకు కారణమని అధికారులు పేర్కొన్నారు.

# బీసీ కోటా పేరుతో కాంగ్రెస్ డ్రామా

- **ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీలో పోరాడాలి: హరీశ్ రావు**

అక్షరదర్బార్, హైదరాబాద్ : 42 శాతం బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామా ఆడుతోందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. గురువారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ, "ఆరు గ్యారంటీల తరహాలోనే ఇది కూడా మరో మోసం" అని ఆయన అన్నారు. 55 ఏళ్ల కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎప్పుడైనా బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడిందా అని ప్రశ్నించారు. బీసీల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీలో పోరాటం చేయాలని, కేంద్రాన్ని ఒత్తిడికి గురి చేసి చట్టం చేయించి షెడ్యూల్ 9లో చేర్చాలని డిమాండ్ చేశారు. "బీసీలకు ప్రేమ ఉందని చూపించుకోవాలనే ఉద్దేశంతో తాత్కాలిక జీవో ఇచ్చి కొత్త నాటకం మొదలుపెట్టారు. స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేస్తూ కాలయాపన చేస్తున్నారు" అని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లపై ఢిల్లీలో బీఆర్ఎస్ ఎప్పుడూ కలిసి పోరాడటానికి సిద్ధంగా ఉందని హరీశ్‌రావు తెలిపారు. "ఉద్యమ పార్టీగా బీఆర్ఎస్ బీసీల హక్కుల కోసం ఎప్పటికీ గొంతెత్తుతుంది, ఢిల్లీని నిలదీస్తుంది" అని ఆయన స్పష్టం చేశారు.



# పోలీస్ పిల్లలను అభినందించిన సీపీ

అక్షరదర్బార్, హనుమకొండ: ఎంబీబీఎస్ లో సీటు సాధించిన పోలీస్ పిల్లలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ గురువారం ఘనంగా సత్కరించి అభినందించారు. కొద్ది రోజుల క్రితం ఎంబీబీఎస్ మొదట విడత కౌన్సిలింగ్ లో సెంట్రల్ జోన్ షేక్ సలీమా కుమార్తె తాన్యసభ హైదరాబాద్ గాంధీ మెడికల్ కళాశాలలో సీటు సాధించగా, హోంగార్డ్ బాలకిషన్ కుమారుడు ముప్పా చందు మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించాడు, మరో హోంగార్డ్ మోహన్ కుమార్తె భవాని ఆసిఫాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించింది. ఈ సందర్భంగా



పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా పిల్లల చదువుల పట్ల అశ్రద్ధ వహించవద్దని.. వారిని ఉన్నత చదువులు చదివే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, అడిషనల్ డీసీపీలు శ్రీనివాస్, ప్రభాకర్ రావు, ఏసీపీ నాగయ్య, ఆర్ఐ చంద్రశేఖర్, హోంగార్డ్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# మానసిక ఆరోగ్యమే మహాభాగ్యం

### –తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పోగు అశోక్

అక్షర దర్బార్, శాయంపేట : మన ఆలోచనలు, ఆచరణలు, నిర్ణయాలు అన్నీ మెదడుపైనే ఆధారపడి ఉంటాయి. ఆనందంగా, సమతుల్యంగా జీవించాలంటే మానసిక ఆరోగ్యం సక్రమంగా ఉండడం అత్యంత అవసరం. ప్రతి సంవత్సరం అక్టోబర్ 10న జరుపుకునే ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం



లక్ష్యం – మానసిక ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచడం, మానసిక రుగ్మతల పట్ల వివక్షను తగ్గించడం అని తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పోగు అశోక్ తెలిపారు. 1992లో "వరల్డ్ ఫెడరేషన్ ఫర్ మెంటల్ హెల్త్" ప్రోత్సాహంతో 150 దేశాలు కలిసి ఈ దినోత్సవాన్ని ప్రారంభించాయి. ఈ సందర్భంగా ప్రతి దేశంలో చర్చలు, సదస్సులు, అవగాహన కార్యక్రమాలు, మానసిక వైకల్యాల చికిత్సా శిబిరాలు నిర్వహిస్తారు.





# దొంతి కాంతమ్మకు నివాళి

### నివాళులర్పించిన ప్రముఖులు

అక్షర దర్బార్ నర్సంపేట : నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాతృమూర్తి కాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, మాజీ ఎంపీపీ తక్కళ్ళపెల్లి రవీందర్ రావు హన్మకొండలోని ఎమ్మెల్యే స్వగృహంలో దొంతి కాంతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఎమ్మెల్యే మాధవరెడ్డి, సోదరులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బూర సుమన్ గౌడ్, ప్రముఖ పాత్రికేయులు రాజేశ్వర్ రావు, బుడిగె మల్లేష్, గుగులోత్ కిషన్ నాయక్, వల్లభనేని కిరణ్, రాజిరెడ్డి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఆర్టీఐ చట్టంపై అవగాహన ఉండాలి

### ప్రిన్సిపాల్ సంపత్ కుమార్

అక్షర దర్బార్, పరకాల: పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆర్టీఐ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కే.సంపత్ కుమార్ మాట్లాడుతూ.. ఆర్టీఐ చట్టం ద్వారా ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడం జరిగిందని, విద్యార్థులందరూ కూడా ఈ చట్టంపై అవగాహన పెంపొందించుకొని సమాజంలో ఏదైనా అన్యాయం జరిగినప్పుడు ఈ చట్టాన్ని ఉపయోగించుకోగలరని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎండీ సర్దార్, పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు ప్రసాద్, వెంకట్ రెడ్డి, రవీందర్ రెడ్డి, పద్మ, తిరుమల, వీర జగన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గంధంగా దామెర చెరువు

# మినీ ట్యాంక్ బండ్

- నిర్వహణలోపంతో అపరిశుభ్రంగా..
- చెత్త కంపుతో స్థానికుల ఇబ్బందులు
- ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులు స్పందించాలి : బీఆర్ఎస్ నేత ఇంగిలి వీరేష్ రావు



అక్షర దర్బార్, పరకాల: ఆహ్లాదకరంగా ఉండాల్సిన దామెర చెరువు( మినీ ట్యాంక్ బండ్) ప్రాంతం దుర్గంధంతో, చెత్త చెదరంతో కంపు కొడుతూ పరిసర ప్రాంతా ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తుందని బీఆర్ఎస్ యువజన నాయకుడు ఇంగిలి వీరేష్ రావు అన్నారు. పరకాల ప్రజలు వాకింగ్ చేయడానికి ఆహ్లాదకరంగా పిల్లలతో గడపడానికి గత ప్రభుత్వం సుమారు రూ.4 కోట్లతో దామెర చెరువు కట్టను మినీ ట్యాంక్ బండ్ గా తీర్చిదిద్దిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి పాలనపై శ్రద్ధ లేకుండా కేవలం పైసలపైనే శ్రద్ధ వహిస్తుందని ఆయన ఎద్దేవా చేశారు. మున్సిపాలిటీకి సంబంధించిన ఆటోలే ఇక్కడ చెత్త వేస్తున్నట్టు స్థానికులు వివరించారని, పక్కనే ఉన్న శ్రీనివాస కాలనీ ప్రజలు ఈ కంపును భరించలేకపోతున్నారని,ఈ దుర్గంధం వల్ల వారి ఆరోగ్యాలకు నష్టం జరుగుతుందని ఆయన అన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్ స్పందించి ఈ సమస్యపై దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన కోరారు.

# కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలి

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి
- బీజేపీ ఓటు చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమం



అక్షర దర్బార్, శాయంపేట : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆదేశానుసారం మండలంలోని నేరేడుపల్లి, ప్రగతిసింగారం, వసంతపూర్, గంగిరేణిగూడెం, సూర్య నాయక్ తండా, అప్పయ్యపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ గ్రామ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో బుచ్చిరెడ్డి మాట్లాడుతూ, "ప్రజలు ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకుల మాయలో పడొద్దని, గ్రామాభివృద్ధి కోసం కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలందరూ సమిష్టిగా పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. తరువాత బీజేపీ ఓటు చోరీలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతుగా ప్రజల నుండి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.



# చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

### ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు

అక్షర దర్బార్, పరకాల: పరకాల ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మండల విద్యాశాఖ అధికారి యస్.రమాదేవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్–14, 17 బాల బాలికలకు మండల స్థాయి కబడ్డీ, ఖోఖో క్రీడల ప్రారంభోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యంపీడీఓ మాట్లాడుతూ నేటి కాలమాన పరిస్థితులలో విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు ఇతర రంగాలలో కూడా రాణించాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం క్రీడాకారులకు టీ షర్టులు ఉచితంగా ఇస్తానని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ పెడరేషన్ పరకాల మండల ఆర్గనైజింగ్ కార్యదర్శి సాంబయ్య, నోడల్ అధికారి నామాని సాంబయ్య, హెచ్ఎం సురేందర్, మధు భాస్కర్, పీడీలు శ్యాం, రజిత, వినయ్, సుధీర్, రాజు, శ్రీకాంత్, సురేష్ పాల్గొన్నారు.

# నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన డీఎస్పీ



అక్షర దర్బార్, టేకుమట్ల: భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు గురువారం టేకుమట్ల మండలంలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి అధికారుల నుండి సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, చట్టం, శాంతి భద్రతలను కట్టుదిట్టంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.



# ఎన్నారై ఆర్థికసాయం

అక్షర దర్బార్, నర్సంపేట : నిరుపేద విద్యార్థి విద్యాభ్యాసానికి ఎన్నారై దాత సాయి మనీష్ అండగా నిలిచారు. పేద కుటుంబానికి చెందిన విద్యార్థి పైచదువుల కోసం రూ.50వేలు విరాళంగా అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. నర్సంపేట పట్టణానికి చెందిన సాయి మనీష్ (ఎన్నారై), రోహిత్ ఈ సేవా కార్యక్రమంలో భాగంగా ముందుకొచ్చారు. వీరు భూపతి రాజశేఖర్–శ్రీదేవి దంపతులకు రూ.50వేలు అందజేశారు. సాయి మనీష్, రోహిత్‌లను గ్రామస్తులు అభినందించారు.





## నాగారంలో పోషణ మాసం

అక్షర దర్బార్, పరకాల: జాతీయ పోషణ మాసం సందర్భంగా ఐసీడీఎస్ పరకాల ప్రాజెక్ట్ నాగారం సెక్టార్ సూపర్ వైజర్, జె. రాణీ ఆధ్వర్యంలో లక్ష్మీపురం గ్రామంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 5 ఏళ్లలోపు చిన్నారులకి, పాఠశాల విద్యార్థులకు ఆర్.బి.ఎస్.కె డాక్టర్ రవీందర్ బృందం ద్వారా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి పిల్లల్లో పోషణ లోపం వల్ల వచ్చే వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలను గుర్తించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ రాణి మాట్లాడుతూ.. పిల్లల్లో పోషణ లోపం లేకుండా సంపూర్ణమైన ఆరోగ్యాన్ని పొందాలంటే స్థానికంగా దొరికే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలతో పిల్లలకు ఇష్టమైన ఆహారం వండి పెట్టాలని జంక్ ఫుడ్ తినకుండా పిల్లలకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ఇంట్లో తయారు చేసే అందించాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రవీందర్, హెల్త్ స్టాఫ్, బోస్ , కవిత, అంగన్వాడీ టీచర్స్ సవిత, స్రవంతి పాల్గొన్నారు.



## బీజేపీలోకి భారీగా చేరికలు

అక్షర దర్బార్, పరకాల: పరకాల నియోజకవర్గం నడికూడా మండల్ వారికోల్ గ్రామం నుండి దొగ్గేలా వంశీ జోగులు ( కొమురయ్య) ఒనెల పాక నరేష్ , రమేష్ , రామంచ మహేందర్ రాజేందర్ లకు భారతీయ జనతా పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన బిజెపి రాష్ట్ర నాయకులు పరకాల నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే డా. పగడాల కాళీ ప్రసాద్ రావు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎరుకల దివాకర్, మాజీ మండల అధ్యక్షులు గోగుల రాజు రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి తిప్పారపు సుధీర్, ధనుంజయ్ ,కొడేపాక కుమారస్వామి, రాజేశ్వరరావు, ఎస్ కె వై విద్యాసంస్థల చైర్మన్ కుమార్ యాదవ్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ఎర్రోళ్ల శ్రీనివాస్ కు పరామర్శ..

అక్షర దర్బార్, పరకాల: తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి ఎర్రోళ్ల విజ్జయ్య పరమపదించారు. విషయం తెలిసిన వెంటనే గురువారం శ్రీనివాస్ స్వగృహానికి చేరుకున్న తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు విజ్జయ్య పార్థివ దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# ప్రమాదం అంచున ప్రయాణం

- వాహనాల్లో కిక్కిరిసేలా కూలీలు
- డ్రైవర్ ఆదమరిస్తే ప్రాణాలు గాల్లో..

అక్షర దర్బార్ శాయంపేట : వీరంతా రోజు వారి మహిళా కూలీలు, రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి. ఎక్కడ పని దొరికితే అక్కడికి వెళుతుంటారు పని ప్రాంతాలకు చేరుకోవదానికి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తారు. అందులో పరిమితి మించి ప్రమాదకరంగా ప్రయాణం చేస్తుంటారు. ఇలా ప్రయాణించే పలువురు ప్రమాదాలకు గురై మృతి చెందిన ఘటనలు మండల కేంద్రంలో ఉన్నాయి. అయినా వాహనదారులతో పాటు ప్రయాణికుల్లో మార్పు రావడం లేదు. కొందరు డ్రైవర్లు తమ వాహనాల్లో కిక్కిరిసేలా మహిళలు వృద్ధులను ఎక్కించుకొని గమ్యాలకు చేరుస్తున్నారు. శాయంపేట మండలంలోని వివిధ గ్రామాల నుండి ప్రైవేట్ వాహనాలలో పరిమితి మించి నిత్యం కూలీలను వివిధ గ్రామాలకు పత్తి తీత పనులకు తరలిస్తున్నారు. డ్రైవర్ ఏమాత్రం ఆదమరిస్తే కూలీల ప్రాణాలు అంతే సంగతులేనని చెప్పనవసరం లేదు. ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న డ్రైవర్లకు అధికారులు కళ్లెం వేస్తారా.. అలాంటి వారి పట్ల అధికారులు తగిన చర్యలు తీసుకుంటారా.. ప్రమాదాలకు అధికారులు ఫుల్ స్టాప్ పెడతారా.. వేచి చూడాల్సిందే.?








# 'లోకల్' ఎన్నికలపై స్టే

- సర్కార్ జారీ చేసిన జీవో నంబర్ 9పై కూడా..
- కౌంటర్ దాఖలుకు సర్కారుకు 4 వారాల గడువు
- అలాగే బీసీ కోటా విచారణకు మరో రెండు వారాలు..
- ఎక్కడికక్కడ నిలిచిపోయిన ఎలక్షన్స్

అక్షర దర్బార్, ప్రధాన ప్రతినిధి: స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 9తో పాటు స్థానిక ఎన్నికల నోటిఫికేషన్పై కూడా హైకోర్టు మధ్యంతర స్టే విధించింది. బీసీ రిజర్వేషన్లపై సుదీర్ఘ వాదనలు విన్న కోర్టు స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ పై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ప్రభుత్వానికి 4 వారాల సమయం ఇచ్చింది. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. బీసీ రిజర్వేషన్లపై తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది. బుధవారం తొలి రోజు వాదనలు విన్న న్యాయస్థానం రెండో రోజు గురువారమూ వాదనలు విన్నది.

### ప్రభుత్వం తరపు ఏజీ వాదనలు..

ప్రభుత్వం తరపున ఏజీ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. బీసీ కులగణనకు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసిందని, స్వాతంత్ర్యం తర్వాత సమగ్ర కుల గణన సర్వే తెలంగాణలోనే జరిగిందని అన్నారు. ఇంటింటికెళ్లి సర్వే చేశారని, ఎవరూ అభ్యంతరం వ్యక్తం చేయలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. "బీసీల జనాభా 57.6 శాతం ఉందనడాన్ని ఎవరూ కాదనడం లేదు. 57.6 శాతం జనాభా ఉన్నా.. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం ఏకగ్రీవంగా నిర్ణయించింది. గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో 42 శాతం ఇవ్వాలని అసెంబ్లీ నిర్ణయించింది. బీసీల్లో రాజకీయ వెనుకబాటుతనం ఉందని అసెంబ్లీ గుర్తించి తీర్మానం చేసింది. గడువులోగా గవర్నర్ ఆమోదించకపోతే చట్టంగా భావించాల్సి ఉంటుంది. తమిళనాడు ప్రభుత్వం, సుప్రీం తీర్పు ప్రకారం నోటిఫై చేయనక్కర్లేదు. అసెంబ్లీ చేసిన చట్టానికి సూత్రప్రాయ ఆమోదం ఉంది. ఇది కోరిక. రాష్ట్ర ప్రజల దాన్ని అసెంబ్లీ ఆమోదించింది. శాస్త్రీయ పద్ధతిలో కులగణన సర్వే జరిగింది. సర్వేలో అన్ని కులాల లెక్కలు తెలిశాయి. బీసీల్లోని సబ్ కేటగిరీల వారీగా వివరాలు సర్వేలో తేలాయి. అగ్రవర్ణాల లెక్కలు కూడా బయటకు వచ్చాయి. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. కొందరు ఇది నోటిఫికేషన్ కాదంటున్నారు. అది తప్పు' అని కోర్టుకు తెలిపారు. నోటిఫికేషన్ ప్రతులను ధర్మాసనం ముందుంచారు. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత న్యాయస్థానాల జోక్యం ఉండబోదని వాదించారు. ఈ అంశాన్ని సుప్రీం కోర్టు కూడా స్పష్టం చేసినట్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. వాదనలు విన్న స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 9తో పాటు స్థానిక ఎన్నికల నోటిఫికేషన్పై కూడా హైకోర్టు స్టే విధించింది.

– మరో న్యాయవాది రవివర్మ తన వాదనలు వినిపిస్తూ... రాజ్యాంగంలో రిజర్వేషన్లపై ఎక్కడా 50శాతం సీలింగ్ లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు కలిపి 85 శాతం జనాభా ఉన్నారని, 85 శాతం జనాభాకు 42 శాతంతో కలిపి 67శాతమే రిజర్వేషన్లు ఇస్తున్నామని వివరించారు. 15 శాతం జనాభాకు 33 శాతం ఓపెన్గానే ఉందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 9పై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

# పనులు త్వరగా పూర్తి చేయాలి

- ఏటీసీ కేంద్రాల అభివృద్ధిపై హనుమకొండ జిల్లా కలెక్టర్
- ములుగు రోడ్డులోని ఏటీసీ కేంద్రాల్లో అభివృద్ధి పనుల పరిశీలన



అక్షరదర్బార్, హనుమకొండ: శాస్త్ర సాంకేతిక విద్యను అందించేందుకు ములుగు రోడ్డులోని ప్రభుత్వ ఐటిఐ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)లలో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. గురువారం ములుగు రోడ్డులోని ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రాంగణంలో నెలకొల్పిన హనుమకొండ, కాజీపేట, వరంగల్ అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్లలో చేపట్టిన అభివృద్ధి పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఇప్పటివరకు పూర్తయిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ఏటీసీలలో కోర్సులకు అనుగుణంగా మిషనరీ, టూల్స్ అన్ని అందుబాటులో ఉండాలని అన్నారు. అంతర్గత రోడ్ల నిర్మాణ పనులు ఆలస్యం చేయకుండా వారం పది రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఏటీసీ విద్యార్థులకు ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా వసరులు సమకూర్చాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. వరంగల్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ బి సీతారాములు, హనుమకొండ ప్రభుత్వ ఐటిఐ, ఏటీసీ ప్రిన్సిపల్ జి సక్రు, కాజీపేట ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, వరంగల్ ఇన్చార్జి ఓంకార్, టీజీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.